

పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి దిన పత్రిక కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఏవైనా సమస్యలుంటే క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
A.C.O - 9003200801
S.R - 9551168092
ఆంధ్రజ్యోతి చిరునామా : జి4, గ్రౌండ్ ఫ్లోర్, రామ్స్ అపార్ట్‌మెంట్, ఓల్డ్ నెం. 40, న్యూ నెంబర్ 35, విజయ రాఘవ రోడ్డు, టి.నగర్, చెన్నై - 600 017

ముంచుకొస్తోంది!

- ముందు జాగ్రత్త చర్యలపై దృష్టి పెట్టండి
- జిల్లా కలెక్టర్లకు సీఎం స్టాలిన్ ఆదేశం

చెన్నై, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చురుకుగా ఉన్న ఈశాన్య రుతుపవనాలు ఓ వైపు, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం మరో వైపు.. వాటి ప్రభావంతో భారీగా వర్షాలు కురుస్తుండటంతో వర్షబాధితులకు చేపట్టాల్సిన సహాయక చర్యలపై ముఖ్యమంత్రి స్టాలిన్ అధికారులతో సమీక్ష జరిపారు. చెన్నై సచివాలయంలో మంగళవారం ఉదయం జరిగిన సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అదే సమయంలో ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్న చెన్నై, కాంచీపురం, చెంగల్పట్టు, తిరువళ్లూరు జిల్లాల కలెక్టర్లు, డెల్టా జిల్లాలైన మైలాడుదురై, నాగపట్టినం, తిరువరూరు, తంజావూరు జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. రాష్ట్రంలో ఈ నెల 16న ఈశాన్యరుతుపవనాలు ప్రవేశించడంతోనే వరుసగా మూడు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. ముఖ్యంగా కన్నియాకుమారి, తెన్‌కాశి, విరుదునగర్, రామనాథపురం, తేని, కోయంబత్తూరు, నీలగిరి జిల్లాల్లో కుండపోతగా వర్షాలు కురిశాయి. ఇదే విధంగా తిరువారూరు, తెన్‌కాశి, విరుదునగర్, రామనాథపురం, తేని, కోయంబత్తూరు, నీలగిరి జిల్లాల్లో భారీ వర్షాల కారణంగా జనజీవనం స్తంభించింది. ఆ జిల్లాల్లో సహాయక చర్యలపై కలెక్టర్లతో స్టాలిన్ సమీక్ష నిర్వహించారు.

సురక్షిత శిబిరాలు ఏర్పాటు...

వర్ష ప్రబాధిత ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్నవారి కోసం తక్షణమే శిబిరాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్లకు సీఎం ఆదేశించారు. ఆయా శిబిరాల్లో ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రెండు రోజుల పాటు నగరంలో కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన ప్రాంతాల వివరాలను కమిషనర్ కుమారగురుబరన్ వద్ద అడిగి తెలుసుకున్నారు. తిరువళ్లూరు, చెన్నై, ,కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాల్లో వర్షాలకు, వరదలకు గురయ్యే ప్రాంతాల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని, వర్షాల వల్ల మట్టి చరియలు విరిగి పడటం, చెట్లు కూలిపడటం వంటి సంఘటనల్లో వెంటనే వాటిని తొలగించేలకు యంత్రాలు, పల్లపు ప్రాంతాల్లో వర్షబాధితులను తరలించేందుకు మోటారు, ఫైబర్ పడవలు, వాననీగిని తొలగించేందుకు మోటార్లు, యాంత్రిక రంపాలు, లారీలు, 51,639 విద్యుత్ స్తంభాలు, 1849 ట్రాన్స్‌పార్మర్లు సిద్ధం చేసినట్లు సీఎం తెలిపారు.



సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి

రాజధానిలో...

నగరంలోనూ వర్షబాధిత ప్రాంతాల్లో అధికారులు జాప్యం లేకుండా సకాలంలో సహాయక చర్యలు చేపట్టాలని సీఎం స్టాలిన్ ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో వాననీరు చేరితే వెంటనే మోటార్లతో తొలగించాలని, రహదారుల్లో చేరిన నీటిని ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్మికులు తొలగించాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా విద్యుత్ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. వర్షబాధితులకు సహాయక చర్యల కోసం కార్పొరేషన్ భవనంలో ప్రత్యేక కంట్రోల్ రూం, హెల్ప్ లైన్ ఏర్పాటు చేయాలని స్టాలిన్ ఆదేశించారు.. ఈ సమీక్షా సమావేశంలో డిప్యూటీ సీఎం ఉదయనిధి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, రెవెన్యూ శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎం. సాయికుమార్, ప్రత్యేక పథకాల అమలు శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ యాదవ్, రాష్ట్ర విద్యుత్ బోర్డు చైర్మన్ డాక్టర్ జే రాధాకృష్ణన్, రెవెన్యూ విపత్తుల నిర్వహణ శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పి. అముద, విపత్తుల నిర్వహణ విభాగం కమిషనర్ సీజీ థామస్ వైద్యనాధన్, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ కమిషన్ జే కుమారగురుబరన్, నీటివనరుల శాఖ కార్యదర్శి జే జయకాంతన్, రహదారులు, మినీ ఓడరేవుల శాఖ కార్యదర్శి ఆర్.సెల్వరాజ్, రాష్ట్ర ప్రజాపంపిణీ వాణిజ్య సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎ.అన్నాదురై తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారులుగా ఐఏఎస్‌లు...

ఈ సమావేశం అనంతరం వర్ష ప్రభావిత 12 జిల్లాల్లో సహాయక చర్యల పర్యవేక్షణకు ఐఏఎస్ అధికారులను ముఖ్యమంత్రి స్టాలిన్ నియమించారు. తిరువళ్లూరు జిల్లాకు చెన్నై ఎల్కాట్ ఎండీ డాక్టర్ కేపీ కార్తికేయన్, కాంచీపురం జిల్లాకు టాడ్కో ఎండీ కేఎస్ కందసామి, చెంగల్పట్టు జిల్లాకు స్కిల్ డెవలప్‌మెంట్ ఎండీ క్రాంతికుమార్ పాటి, విల్లుపురం జిల్లాకు కార్మిక సంక్షేమ శాఖ సంచాలకులు ఎస్‌ఏ రామన్, కడలూరు జిల్లాకు సొరంగం, ఖనిజవనరుల సంస్థ సంచాలకులు డి.మోహన్, మైలాడుదురైకి కోఆప్టెక్స్ ఎండీ కవితా రామును ప్రత్యేకాధికారులుగా నియమించారు. ఇదే విధంగా తిరువారూరు జిల్లాకు ఆదిద్రావిడ సంక్షేమ శాఖ కమిషనర్ డి.ఆనంద్, నాగపట్టినం జిల్లాకు రాష్ట్ర వినియోగదారుల వాణిజ్య సంస్థ ఎండీ ఎ.అన్నాదురై, తంజావూరు జిల్లాకు రాష్ట్ర వైద్యసేవల సంఘం అధికారి హెచ్ కృష్ణుడు, కళ్ళకురిచ్చికి రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి పి శ్రీ.వెంకటప్రియ, అరియలూరుకు భారతీయ, హోమియోపతి సంస్థ కమిషనర్ ఎం.విజయలక్ష్మి. పెరంబలూరుకు దివ్యాంగుల సంక్షేమ విభాగం కమిషనర్ ఎం. లక్ష్మి అధికారులుగా నియమితులయ్యా రు.



టి.నగర్‌లో మంగళవారం ఉదయం భారీ వర్షంలోనే వెళుతున్న వాహనచోదకులు

రిజర్వాయర్లలో పెరుగుతున్న నీటిమట్టం



పూర్తిస్థాయిలో నిండి సముద్రాన్ని తలపిస్తున్న పూండి రిజర్వాయర్

ప్యారీస్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లాలో భారీ వర్షాల కారణంగా గ్రేటర్ చెన్నైకి తాగునీరందించే రిజర్వాయర్లు పూర్తిస్థాయిలో నిండాయి. ఈ రిజర్వాయర్ల పూర్తిసామర్థ్యం 11,757 మిలియన్ ఘనపుటడుగులు కాగా, మంగళవారం నాటికి 8,736 ఘనపుటడుగుల నీరుందని జలవనరులశాఖ అధికారులు తెలిపారు. పూండి రిజర్వాయర్ పూర్తిసామర్థ్యం 3,231 మిలియన్ ఘనపుటడుగులు కాగా, ప్రస్తుతం 2,521 మిలియన్ ఘనపుటడుగుల మేర నీటిమట్టం పెరిగింది. ఈ రిజర్వాయర్‌కు సెకనుకు 3,400 ఘనపుటడుగుల చొప్పున నీరుచేరుతుండగా, 2,387 ఘనపుటడుగుల నీటిని ప్రధాన కాలువల్లో విడుదల చేస్తున్నారు. అదేవిధంగా పుళల్ జలాశయం పూర్తిసామర్థ్యం 3,380 ఘనపుటడుగులు కాగా ప్రస్తుతం 2,736 మిలియన్ ఘనపుటడుగుల నీరుంది. సెకనుకు 2వేల ఘనపుటడుగుల నీటిని విడుదల చేస్తున్నారు. అదేవిధంగా చెంబరంబాక్కం రిజర్వాయర్ పూర్తిసామర్థ్యం 3,400 మిలియన్ ఘనపుటడుగులు కాగా, 2,553 మిలియన్ ఘనపుటడుగుల మేర నమోదైంది. షోళవరం జలాశయం పూర్తిసామర్థ్యం 1,081 ఘనపుటడుగులు కాగా ప్రస్తుతం 0.403 మిలియన్ ఘనపుటడుగుల నీరు ఉంది. కన్నన్‌కోట్టై రిజర్వాయర్ పూర్తిసామర్థ్యం 500 మిలియన్ ఘనపుటడుగులు కాగా 408 ఘనపుటడుగుల మేర ఉంది.. ఈ విధంగా తిరువళ్లూరు జలాశయాలు, పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నీటిమట్టాలు క్రమక్రమంగా పెరుగుతున్నాయని, ఇందువల్ల మరో మూడు నెలలు తాగునీటి కొరత లేదని జలవనరులశాఖ అధికారులు తెలిపారు.

పొంచివున్న వాయు'గండం'

చెన్నై, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ నెల 16న ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించినప్పటి నుంచే సముద్రతీర జిల్లాలు, కావేరి డెల్టా ప్రాంతాల్లో చెదురుమదురుగా వర్షాలు కురుసాస్తున్నారు. ఈ నేపథ్యంలో నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మంగళవారం ఉదయం మరింత బలపడి వాయుగుండగా మారిందని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఆ వాయుగుండం బుధవారం మధ్యాహ్నం ఉత్తర తమిళనాడు - పుదుచ్చేరి, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాల వైపు కదులుతూ పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో మరింతగా బలపడే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. వాయుగుండం ప్రభావం, ఈశాన్యరుతుపవనాల కారణంగా మంగళవారం అర్ధరాత్రిలోగా విల్లుపురం, కడలూరు, మైలాడుదురై, నాగపట్టినం, రామనాథపురం, తంజావూరు, తిరువారూరు, పుదుకోట, పుదుచ్చేరి, కారైక్కాల్‌లకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు వివరించారు. ఈ నేపథ్యంలో బుధవారం తిరువళ్లూరు, చెన్నై, చెంగల్పట్టు, కాంచీపురం, విల్లుపురం, కడలూరు, మైలాడుదురై, తిరువారూరు, నాగపట్టినం, తంజావూరు, కళ్ళకురిచ్చి, అరియలూరు, పెరంబలూరు, తిరుపత్తూరు జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో కుండపోతగా, మరికొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరుగా వర్షాలు కురుస్తాయని ప్రకటించారు.

14 యేళ్ల తర్వాత దీపావళికి కుండపోత...

ఇక రాజధాని నగరం చెన్నైలో 14 యేళ్ల తర్వాత దీపావళి రోజున కుండపోతగా వర్షం కురిసినట్లు వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. 2011 అక్టోబరు 26న దీపావళి సందర్భంగా కుండపోతగా వర్షాలు కురిశాయని, మళ్ళీ అదే స్థాయిలో దీపావళికి కుండపోతగా వర్షాలు కురిశాయన్నారు. సోమవారం మధ్యాహ్నం నుంచి మంగళవారం వేకువజాము వరకు నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. ఇక బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా సముద్రతీర జిల్లాల్లో గంటకు 55 నుంచి 60 కి.మీల వేగంతో పెనుగాలులు వీచే అవకాశం ఉండటంతో జాలర్లు చేపలవేటకు వెళ్ళకూడదని మత్స్యశాఖ అధికారులు హెచ్చరించారు.

● 14 జిల్లాలకు భారీ వర్షసూచన



వర్షంలో రెయిన్‌కోట్లు ధరించి వాహనాలు నడుపుతున్న నగరవాసులు

దీపావళి 'కిక్కు'

- మూడు రోజుల్లో రూ.790 కోట్ల మద్యం విక్రయాలు



ప్యారీస్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా రాష్ట్రంలోని 4,829 మద్యం దుకాణాల్లో మూడు రోజుల్లో రూ.790 కోట్లకు పైగా మద్యం విక్రయాలు జరిగినట్లు టాస్మాక్ సంస్థ తెలిపింది. దేశవ్యాప్తంగా సోమవారం దీపావళి పండుగ జరుపుకున్నారు. దీపావళి, పొంగల్, నూతన సంవత్సరం సందర్భంగా మద్యం విక్రయాలు ఎక్కువగా జరుగుతుంటాయి పండుగల రోజుల్లో సాధారణం కంటే రెండు, మూడింతలు అధికంగా మద్యం నిల్వ ఉంచుతుంటారు. దీపావళి పండుగ సందర్భంగా రూ.790 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. గత ఏడాది దీపావళి సందర్భంగా రూ.438 కోట్లకు పైగా మద్యం విక్రయాలు జరగగా, ఈ ఏడాది రూ.600కోట్ల మేర మద్యం విక్రయించాలని టాస్మాక్ సంస్థ లక్ష్యం పెట్టుకుంది. అయితే ఆ లక్ష్యాన్ని దాటి రూ.789కోట్ల 85లక్షల మేర మద్యం అమ్మకాలు జరిగాయి. ఈ నెల 18న రూ.230కోట్ల 6లక్షలు, 19న రూ.293కోట్ల 73లక్షలు, దీపావళి రోజున రూ.266కోట్ల 6లక్షలు మొత్తం రూ.789కోట్ల 85లక్షల మేర మద్యం విక్రయాలు జరిగినట్లు టాస్మాక్ అధికారులు తెలిపారు.

మా కూటమిలో చేరకుంటే మీ పార్టీ గల్లంతే!

- టీవీకే అధినేతకు ఆర్బీ ఉదయకుమార్ హెచ్చరిక



ఉదయకుమార్ - విజయ్

చెన్నై, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమిళగ వెట్రి కళగం (టీవీకే) అన్నాడీఎంకే కూటమిలో చేరకపోతే ఆ పార్టీ పత్తాలేకుండా పోతుందని మాజీ మంత్రి, శాసనసభాపక్ష ఉపనాయకుడు ఆర్బీ ఉదయకుమార్ హెచ్చరించారు. మదురైలో దీపావళి వేడుకల్లో భాగంగా తెప్పకుళం ముక్తీశ్వరాలయంలో మంగళవారం మధ్యాహ్నం ఆయన 'అమ్మా చారిటబుల్ ట్రస్ట్' తరపున భక్తులకు అన్నదానం చేశారు. ఆ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి డీఎంకే ప్రభుత్వాన్ని గద్దె దించటమే ప్రధాన లక్ష్యంగా అన్నాడీఎంకే బీజేపీతో పొత్తు కుదుర్చుకుందని, త్వరలో మరిన్ని పార్టీలు తమ కూటమిలో చేరనున్నాయని చెప్పారు. అన్నాడీఎంకే మెగా కూటమిలో టీవీకే చేరటానికి అనువైన సమయం ఇదేనన్న విషయాన్ని ఆ పార్టీ నేత విజయ్ గ్రహించాలని సూచించారు. అన్నాడీఎంకే కూటమిలో టీవీకే చేరకపోతే అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఆ పార్టీ గల్లంతవుతుందని, డీఎంకే ఆ పార్టీని నాశనం చేయడం తథ్యమని ఆర్బీ ఉదయకుమార్ హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్‌లో మెగాస్టార్ చిరంజీవి రాజకీయ పార్టీని ప్రారంభించినప్పుడు ఎన్నికల పొత్తుపై సరైన నిర్ణయం తీసుకోకపోవడం వల్లే రాజకీయాల్లో రాణించలేకపోయారని, జనసేన నేత పవన్‌కళ్యాణ్ సరైన సమయంలో పొత్తుపై చక్కటి నిర్ణయం తీసుకోవడం వల్ల పార్టీ బాగుపడటమే కాకుండా ఆయన ఉప ముఖ్యమంత్రి పదవి కూడా చేపట్టిన విషయాన్ని విజయ్ గుర్తు చేసుకుంటే మంచిదన్నారు. డీఎంకేను గద్దె దింపటానికే అన్నాడీఎంకే బీజేపీతో పొత్తు కుదుర్చుకుందని, మళ్ళీ రాష్ట్రంలో డీఎంకే అధికారంలోకి వస్తే టీవీకేకి పుట్టగతులుండవని, ఆ తర్వాత విజయ్‌ని ఆ దేవుడు కూడా కాపాడలేడని హెచ్చరించారు.

24 నుంచి పుదువైలో ఎలక్ట్రి బస్సులు

పుదుచ్చేరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పాలిత రాష్ట్రం పుదుచ్చేరి నగర వాసుల కోసం ప్రైవేటు సంస్థ భాగస్వామ్యంతో ఈ నెల 24 నుండి ఎలక్ట్రిక్ బస్సు లను ప్రారంభించనున్నట్లు పుదుచ్చేరి రోడ్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ (పీఆర్‌టీసీ) ప్రకటించింది. మొత్తం 25 ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలు, మరమ్మతుల పనులను ప్రైవేటు సంస్థ నిర్వహించనుంది. స్మార్ట్ సిటీ పథకంలో కొనుగోలు చేసిన ఎలక్ట్రిక్ బస్సులకు రూ.4కోట్లతో పుదుచ్చేరి మరమలైఅడిగలార్ రోడ్డులో ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేశారు. అయితే ఈ బస్సుల్లో పీఆర్‌టీసీ ఉద్యోగులు టిక్కెట్ వసూలు చేస్తారు. 24వ తేదీ 25 ఈ-బస్‌ల సేవలను ముఖ్యమంత్రి రంగస్వామి ప్రారంభించి, పురపాలక సంఘం ఆధ్వర్యంలో మహిళా స్వయం సేవల సంఘాలకు 31 ఎలక్ట్రిక్ ఆటోలను పంపిణీ చేస్తారు.



పుదుచ్చేరిలో ప్రారంభంకానున్న ఎలక్ట్రిక్ బస్సులు

మదురై మేయర్ ఎంపికపై మంత్రుల మల్లగుల్లాలు

- రేసులో నలుగురు మహిళలు



మదురై కార్పొరేషన్ కార్యాలయం

చెన్నై, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మదురై కార్పొరేషన్ మేయర్ ఎంపికపై మంత్రులు పీటీఆర్ పళనివేల్ త్యాగరాజన్, మూర్తి, కేఎన్ నెహ్రూ మల్లగుల్లాలు పడుతున్నారు. ప్రస్తుతం మేయర్ పదవి కోసం నలుగురు మహిళా కార్పొరేటర్లు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. వీరికి ముగ్గురు మంత్రుల అండదండలున్నాయి. కార్పొరేషన్‌లో ఆస్తి పన్నుల విధింపులో భారీ స్థాయిలో జరిగిన అవినీతి కేసులో భర్త పొన్ వసంత్ అరెస్టు తరవాత మేయర్ ఇంద్రాణి ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. మరో వైపు అన్నాడీఎంకే , డీఎంకే కార్పొరేటర్లు మేయర్ ఇంద్రాణిపై చర్యలు తీసుకోవాలని పట్టుబట్టారు. అవినీతికి పాల్పడే మేయర్‌ను పదవి నుండి తొలగించాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, ఆ పార్టీ సీనియర్ నేత సెల్లూర్ కే రాజు డిమాండ్ చేశారు. ఈ విషయమై డీఎంకే స్థానిక నాయకులు కొందరు కార్పొరేషన్ ఎన్నికల తర్వాత సాధారణ కార్పొరేటర్‌గానే అందరికీ తెలిసిన ఇంద్రాణిని పార్టీ సీనియర్లు పొన్ ముత్తురామలింగం, కే దళపతి, మంత్రులు పి.మూర్తి, తంగం తెన్నరసు సిఫారసులను తోసిరాజని మేయర్‌గా ప్రకటించారు. దీనికంతటికీ పార్టీలో పట్టు కలిగిన మంత్రి పీటీఆర్ పళనిరాజన్ ప్రధాన కారణమని, మేయర్ ఎంపికలో తన మాట నెగ్గటంతో మదురై రాజకీయాల్లో తనకంటూ ఓ బలమైన వర్గాన్ని ఏర్పాటు చేసుకోవాలనుకున్నారు దీంతో ప్రారంభం నుంచే డీఎంకే కార్పొరేటర్లందరూ మేయర్‌తో ఘర్షణ వైఖరినే అవలంబించారు. మేయర్ పనితీరుపై నిఘా వేయడానికి మంత్రి పళనివేల్‌రాజన్ ఓ సహాయకురాలిని కూడా నియమించారు. ఇవేవీ పట్టించుకోకుండా మేయర్ ఇంద్రాణి భర్త పొన్ వసంత్ కార్పొరేషన్ వ్యవహారాలలో జోక్యం చేసుకునేవారు.. ప్రారంభంలో ఈ విషయం తెలుసుకున్న మంత్రి పళనివేల్‌రాజన్ మదురైలో తాను పాల్గొనే సభలు, కార్యక్రమాల్లో మేయర్ భర్త పొన్ వసంత్ హాజరుకాకూడదంటూ ఆదేశాలిచ్చారు. ఆ తర్వాత ఆస్తి పన్నుల విధింపులలో అవినీతి అక్రమాలు బయల్పడటంతో మేయర్ ఇంద్రాణి కూడా తాను పాల్గొనే సభలు, కార్యక్రమాలకు హాజరుకాకూడదని ఆదేశించారు. అదే సమయంలో కార్పొరేషన్ పరిధిలో వాణిజ్య భవనాలకు ఆస్తి పన్ను విధించడంలో భారీ స్థాయిలో అవినీతి జరిగిందని,, ఫలితంగా సుమారు రూ.200 కోట్ల మేర కార్పొరేషన్‌కు నష్టం వాటిల్లిందని ఆరోపిస్తూ సెంట్రల్ క్రైమ్ బ్రాంచి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరిపారు. ఈ వ్యవహారం పార్టీకి చెడ్డపేరు తెచ్చిపెట్టిందంటూ కార్పొరేషన్‌లోని వివిధ కమిటీలకు చైర్మన్లుగా ఉన్న ఏడుగురి చేత తమ పదవులకు రాజీనామా చేయించారు. మేయర్ ఇంద్రాణి భర్త పొన్ వసంత్, పన్నుల విధింపు కమిటీ చైర్మన్ విజయలక్ష్మి భర్త కన్నన్, కార్పొరేషన్ ఆఫీసర్లు, సిబ్బంది సహా మొత్త 23 మందిని అరెస్టు చేశారు. ఆ తర్వాత కార్పొరేషన్ కార్యక్రమాలకు దూరంగా ఉన్న మేయర్ ఇంద్రాణి నగర పాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ ఆదేశాల మేరకు తన పదవికి రాజీనామా చేసినట్లు డీఎంకే స్థానిక నాయకులు తెలిపారు. ఈ పరిస్థితుల్లో ఈ నెల 17న డిప్యూటీ మేయర్ నాగరాజన్ అధ్యక్షతన జరిన కార్పొరేషన్ ప్రత్యేక కౌన్సిల్ సమావేశంలో మేయర్ ఇంద్రాణి రాజీనామా ఆమోదించారు. దీంతో ఖాళీ అయిన మేయర్ పదవికి త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుందని డీఎంకే, అన్నాడీఎంకే కార్పొరేటర్లు ఎదురుచూస్తున్నారు. ఈ విషయమై ప్రతిపక్ష నాయకుడు సోలైరాజా మాట్లాడుతూ కార్పొరేషన్‌లోని అవినీతి అక్రమాలను ఆధారాల సహా ప్రతి కౌన్సిల్ సమావేశంలో వెల్లడించామని తెలిపారు. ఆ ఆధారాలతో మాజీ కమిషనర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మేయర్ భర్త సహా 23 మందిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు మేయర్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేయడంతో పాటు, హైకోర్టులోనూ పిటిషన్ వేశామని, ఆ నేపథ్యంలో మేయర్ తన పదవికి రాజీనామా చేయడం తాము జరిపిన ఆందోళనలకు లభించిన విజయంగా భావిస్తున్నామని చెప్పారు.



మంత్రులు పళనివేల్ త్యాగరాజన్, మూర్తి



కార్పొరేటర్లు రోహిణి, లచ్చికాశ్రీ, వాసుగి, విజయ్ మౌసమి

కొత్త అభ్యర్థి ఎవరు?

మదురై మేయర్ పదవిలో ఎవరిని నియమిస్తారనే విషయమై సస్పెన్స్ కొనసాగుతోంది. మంత్రి పళనివేల్‌రాజన్ మళ్ళీ తన సిఫార్సుతో మహిళా సభ్యుల్లో ఒకరికి ఈ పదవి కట్టబెట్టే ప్రయత్నాల్లో ఉన్నట్లు చెబుతున్నారు. జోనల్ కమిటీ చైర్మన్లుగా ఉంటూ పన్నుల విధింపు అవినీతి అక్రమాల వ్యవహారంలో పదవులు కోల్పోయిన కార్పొరేటర్లు వాసుగి, శరవణ భువనేశ్వరి, పాండిసెల్వి, ఇందిరా గాంధీ, భామా వారిలో ఒకరిని మేయర్‌గా ఎంపిక చేయాలని మంత్రులు మూర్తి, పళనివేల్ త్యాగరాజన్ అధిష్టానంపై ఒత్తిడి చేస్తున్నారు. మేయర్ పదవికి 79వ వార్డు కార్పొరేటర్ లచ్చికాశ్రీ, 32వ వార్డు కార్పొరేటర్ విజయ్ మౌసమి, రోహిణి పేర్లను డీఎంకే అధిష్టానం పరిశీలిస్తున్నట్లు సమాచారం. కొత్త మేయర్ ఎంపికకు కొద్ది నెలల సమయం పడుతుందని, అంతవరకూ సీపీఎంకు చెందిన డిప్యూటీ మేయర్ నాగరాజన్‌ను ఇన్‌ఛార్జ్ మేయర్‌గా ప్రకటించే అవకాశాలున్నాయని డీఎంకే స్థానిక నాయకులు చెబుతున్నారు.



'కరుప్పు'లో సూర్య

'కరుప్పు'లో నటించాను

● దర్శకుడు ఆర్.జే.బాలాజీ

సూర్య హీరోగా నటిస్తున్న 'కరుప్పు' మూవీలో తాను కూడా నటించానని ఆ చిత్ర దర్శకుడు, నటుడు, ఆర్జే.బాలాజీ వెల్లడించారు. ఆయన నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ చిత్ర విశేషాలను వెల్లడిస్తూ, 'చిత్ర ఎడిటింగ్ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. నేను ఒక పని మొదలుపెడితే ఆ పని పూర్తయ్యేంత వరకు బయట ఎక్కడా కనిపించను. అధికంగా మాఆట్లడను. ఇపుడు నేను చేస్తున్న పని దాదాపుగా పూర్తయింది. ఎడిటింగ్ పూర్తయింది. సినిమా నాకు బాగా నచ్చింది. సినిమా చూసిన తర్వాత నిర్మాతలు కూడా ప్రశాంతంగా సంతోషంగా ఉన్నారు. ఇపుడంతా హంగామా చేస్తే ఫలితం లేదన్నారు. కాగా, దీపావళి సందర్భంగా 'కరుప్పు' మూవీ నుంచి సరికొత్త లుక్‌ను రిలీజ్ చేశారు.


ఎఫ్‌ఎంఎఫ్ మూవీలో ఆరుగురు కొత్త హీరోయిన్లు

ఫ్రెండ్స్ మేజిక్ ఫిలిమ్స్ (ఎఫ్‌ఎంఎఫ్) నిర్మించే తొలి చిత్రంలో ఏకంగా ఆరుగురు కొత్త హీరోయిన్లను వెండితెరకు పరిచయం చేయనుంది. చెన్నై ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన ఎస్.ఎస్.శ్రీ దర్శకత్వంలో ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ప్రస్తుతం ఈ సినిమా నిర్మాణం చివరి దశలో ఉంది. 'బిగ్ బాస్' సెలిబ్రిటీల్లో ఒకరైన ఏకే వినోద్ నాలుగు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. అలాగే, 'పరితాంపంగల్' ఫేం రాహుల్ మరో కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇందులో తొలిసారి ఆరుగురు హీరోయిన్లు వెండితెరకు పరిచయం చేస్తున్నారు. ఈ సినిమా విశేషాలను దర్శకుడు ఎస్.ఎల్.శ్రీ వివరిస్తూ, 'స్నేహం, ప్రేమ, అందం అనే మూడు అంశాలను ప్రధానంగా తీసుకుని ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన ఈ చిత్రం ప్రోమో ఇంటర్నెట్‌లో వైరల్ అయింది. త్వరలోనే చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడిస్తాం' అని పేర్కొన్నారు.



ఎస్ఎల్ శ్రీ, ఏకే వినోద్

పాతికేళ్ల కల నిజమైంది: విశాల్



'మగుడం'లో విశాల్

దర్శకత్వం చేపట్టాలన్న తన పాతికేళ్ళ కల ఇప్పటికి నిజమైందని హీరో విశాల్ అన్నారు. ప్రముఖ నిర్మాత ఆర్‌బీ చౌదరి నిర్మాణంలో సూపర్ గుడ్ ఫిలిమ్స్ బ్యానరుపై రూపొందుతున్న 'మగుడం' (తెలుగులో 'మకుటం') చిత్రానికి తానే దర్శకత్వం వహిస్తున్నట్టు దీపావళి పండుగ రోజున అధికారికంగా సోషల్ మీడియా వేదికగా ఆయన ఒక పోస్ట్ పెట్టారు. బహిర్గతం చేసే సమయం ఆసన్నమైందని, ఇకపై రహస్యంగా ఉంచాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. 'అందరికీ దీపావళి శుభాకాంక్షలు. ఈ పండుగ శుభసందర్భంలో 'మగుడం' మూవీ సెకండ్ లుక్ మీతో పంచుకోవడం ఆనందంగా ఉంది. ఈ సినిమాకు నేను దర్శకత్వం వహిస్తానని ఊహించలేదు. పరిస్థితుల కారణంగా ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందే తప్ప ఇందులో ఎవరి బలవంతం లేదు. కొన్నిసార్లు సరైన నిర్ణయాలు తీసుకోవడమంటే బాధ్యత స్వీకరించడమే. సినిమా అంటే కమిట్‌మెంట్. మనల్ని ఆదరించే ప్రేక్షకులు, నిర్మాత నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి. అందుకే రీ వర్క్ చేసి ఈ సినిమాను తీసుకొస్తున్నా. ఇది కొత్త ప్రయాణం' అని విశాల్ పేర్కొన్నారు. ఇది విశాల్‌కు 35వ చిత్రం కాగా, సూపర్‌గుడ్ ఫిలిమ్స్‌కు 99వ మూవీ కావడం గమనార్హం.

రజనీకాంత్ ఇంట దీపావళి సందడి



కుటుంబ సభ్యులతో రజనీకాంత్

చిత్రజ్యోతి

సూపర్‌స్టార్ రజనీకాంత్ తన కుటుంబ సభ్యులతో కలిసిదీపావళి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పండుగను పురస్కరించుకుని పోయెస్ గార్డెన్‌లోని తన నివాసానికి వచ్చిన అభిమానులకు ఆయన దీపావళి శుభాకాంక్షలు తెలిపి, ఆ తర్వాత తన కుటుంబ సభ్యులతో కలిసి ఈ వేడుకలను జరుపుకున్నారు. తన సతీమణి లత, ఇద్దరు కుమార్తెలు ఐశ్వర్య, సౌందర్య, మనవవళ్ళతో కలిసి రజనీకాంత్ పండుగ పూట సంతోషంగా గడిపారు. అయితే, ఈ వేడుకల్లో మాజీ దంపతులైన ధనుష్ - ఐశ్వర్య కుమారులు లింగా, వేద్ మాత్రం కనిపించకపోవడం గమనార్హం. ఇదిలావుంటే, ఇటీవల తన భార్య సైంధవి నుంచి విడాకులు తీసుకున్న ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ దీపావళి పండుగను తన స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకున్నారు.



అభిమానులకు అభివాదం చేస్తున్న సూపర్‌స్టార్

'ఎమ్మార్సీ' స్పోర్ట్స్ స్టేడియంకు తంగరాజ్ పేరు



1956లో మెల్‌బోర్న్ ఒలింపిక్స్‌లో విజయం సాధించి అప్పటి భారత రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్ నుంచి ట్రోఫీ అందుకుంటున్న పీటర్ తంగరాజ్

పెరంబూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా వెల్లింగ్టన్‌లో మద్రాసు రెజిమెంటల్ సెంటర్ (ఎమ్మార్సీ) లోని స్టేడియానికి ప్రముఖ ఫుట్‌బాల్ క్రీడాకారులు పీటర్ తంగరాజ్ పేరు పెట్టారు. ఈ మేరకు భారత సైనిక విభాగం విడుదల చేసిన ప్రకటనలో... ఎమ్మార్సీకి చెందిన హవల్దార్ పీటర్ తంగరాజ్ ఆసియా క్రీడలు, 1956, 1960లో మెల్‌బోర్న్, రోమ్‌లో జరిగిన ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించారని తెలిపింది. 1956లో ఆసియాలో అత్యుత్తమ గోల్ కీపర్‌గా ఎంపికైన ఆయనను, 1967లో అర్జున అవార్డుతో కేంద్ర ప్రభుత్వం సత్కరించిందన్నారు. ఆయన ఎమ్మార్సీ ఫుట్‌బాల్ జట్టులో సభ్యుడిగా ఉంటూ, భారత సైన్యంలో 1955, 1958లో రెండు సార్లు డ్యూరాండ్ కప్ గెలుచుకున్న ఏకైన రెజిమెంటల్ జట్టు ఇదేనని, ఇప్పటివరకు ఆ రికార్డు చెక్కుచెదరలేదని తెలిపింది. అలాంటి దిగ్గజ క్రీడాకారుడికి తగిన గుర్తింపు, ఆయనకు నివాళులర్పించేలా





తంగరాజ్ స్టేడియం

వెల్లింగ్టన్ ఎమ్మార్సీలోని స్పోర్ట్స్ స్టేడియానికి 'తంగరాజ్ స్టేడియం' అని పేరు పెట్టినట్లు తెలిపారు. ఈ స్టేడియం ఎమ్మార్సీ క్రీడా కార్యక్రమాలు, నీలగిరి జిల్లాలోని పాఠశాలలకు క్రీడా మైదానం ఉంటుందని, వర్ధమాన క్రీడాకారులను తయారుచేయాలన్నదే తమ లక్ష్యమని ఎమ్మార్సీ ప్రకటనలో తెలిపింది.




కన్నియాకుమారిలోని శ్రీవారి ఆలయం

కుమరి శ్రీవారి ఆలయంలో 31నుంచి పవిత్రోత్సవాలు

ప్యారీస్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారిలోని వేంకటాచలపతి ఆలయంలో ఈ నెల 31న పవిత్రోత్సవాలు ప్రారంభకానున్నాయి. నవంబర్ 3వ తేదీ వరకు నాలుగు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ప్రముఖ పర్యాటక ప్రాంతం కన్నియాకుమారిలో టీటీడీ ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీవారి ఆలయాన్ని 2019 జనవరి 28న మహాసంప్రోక్షణ చేసి ప్రారంభించారు. ఈ ఆరేళ్లలో నాలుగోసారి పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ నెల 31వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు అంకురార్పణంతో పవిత్రోత్సవాలు ప్రారంభమవుతాయి. రెండో రోజు ఉదయం 8.30 గంటలకు యాగపూజ, 10.30 గంటలకు ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, అభిషేకాలు, సాయంత్రం 6.30గంటలకు పవిత్ర ప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతాయి. నవంబర్ 3వ తేదీ ఉదయం 8.30, సాయంత్రం 5.30 గంటలకు యాగశాలపూజ, పూర్ణాహుతి, ప్రత్యేక నైవేద్యర సమర్పిస్తారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటాచలపతి స్వామివార్లను అలంకరించి వాహనంలో కొలువుదీర్చి విమాన ప్రాకారోత్సవం నిర్వహిస్తారు. రాత్రి 8.30 గంటలకు పూర్ణాహుతి అనంతరం స్వామివారి శిరస్సుపై వజ్రకిరీటం ఉంచి ఏకాంతసేవ పూజలు నిర్వస్తారు. ఈ ఉత్సవాలను టీటీడీ ఆగమ సలహాదారు నేతృత్వంలో ఏడుగురు అర్చకస్వాములు నిర్వహిస్తారని, ఆలయ నిర్వాహకులు తెలిపారు.

అన్నపూర్ణేశ్వరి అమ్మవారికి 1,008 లడ్డూలతో అలంకరణ


పెరంబూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ ఆర్ఎస్ పురంలో ఉన్న అన్నపూర్ణేశ్వరి ఆలయంలో, దీపావళి పండుగను పురస్కరించుకుని, సోమవారం గర్భగుడిని 1,008 లడ్డూలతో రథంలా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దర్శనానికి తెల్లవారుజామున 5 గంటలకే భక్తులు క్యూలైన్లలో బారులుతీరారు. రాత్రి 8 గంటల వరకు భక్తులను దర్శనానికి అనుమతించారు. భక్తులందరికి ఆలయ నిర్వాహకులు లడ్డు ప్రసాదంగా అందజేశారు.



గర్భాలయాన్ని లడ్డూలతో రథం ఆకారంలో అలంకరించిన దృశ్యం

మేట్టూర్ డ్యాం సరికొత్త రికార్డు

● యేడాదిలో ఏడోసారి నిండిన జలాశయం



నిండుకుండలా మేట్టూర్ డ్యాం

టి.నగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లాలోని మేట్టూర్ డ్యామ్ సోమవారం సరికొత్త రికార్డు నెలకొల్పింది. 92 యేళ్ల ఆ డ్యామ్ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా ఒకే యేడాది ఏడుసార్లు పూర్తి స్థాయిగా నీటితో నిండి సరికొత్త రికార్డు సృష్టించింది. కర్ణాటకలోని ప్రధాన జలాశయాల పరివాహక ప్రాంతాల్లో, రాష్ట్రంలో కావేరి నదీ పరీవాహక ప్రాంతాల్లోనూ భారీగా వర్షాలు కురవటంతో మేట్టూరు జలాశయం తరచూ జలకళ సంతరించుకుంటోంది. ఈ యేడాది తొలిసారి కర్ణాటక జలాశయాల నుండి 1.25 లక్షల ఘనపుటడుగుల దాకా అదనపు జలాలను విడుదల చేయడంతో రాష్ట్రంలో కావేరి వాగు ప్రాంతాల్లో వరద దృశ్యాలు నెలకొన్నాయి. ఈ యేడాదిలో మొదటిసారి జూన్ 29న మేట్టూర్ డ్యాం పూర్తిస్థాయి నిండింది. ఆ తరువాత సేలం జిల్లాలోనూ, మేట్టూరు డ్యామ్ పరిసర ప్రాంతాల్లోనూ భారీగా వర్షాలు కురవటంతో రెండోసారి జూలై 5న డ్యామ్ పూర్తి కెపాసిటీతో నిండింది. ఆ తర్వాత జూలై 20న మూడోసారి, జూలై 25న నాలుగోసారిగా నిండింది. ఇదే విధంగా గత ఆగస్టు 20న ఐదోసారి, సెప్టెంబర్ 2న ఆరోసారి మేట్టూరు డ్యామ్ జలకళను సంతరించుకుంది. ఈ నేపథ్యంలో ఈశాన్య రుతుపవనాల కారణంగా భారీగా వర్షాలు కురువటంతో కర్ణాటకలోని కృష్ణరాజసాగర్ తదితర జలాశయాలు పూర్తిగా నిండిపోవటంతో అదనపు నీటిని విడుదల చేశారు. ఆ జలాలన్నీ హొగెనేకల్ జలపాతం మీదుగా బిలిగుండ్లు చేరి, అక్కడి నుండి కావేరి వాగులో ప్రవహించి మేట్టూర్ డ్యామ్‌లోకి చేరుతున్నాయి. దీంతో సోమవారం మధ్యాహ్నం మేట్టూర్ డ్యాం ఏడోసారి పూర్తిస్థాయిలో నిండటంతో రైతులు హర్షం ప్రకటిస్తున్నారు. ప్రస్తుతం ఆ డ్యామ్‌లో 93.47 టీఎంసీల మేరకు నీటి నిల్వలు ఉన్నాయని ఇరిగేషన్ అధికారులు ప్రకటించారు.



డ్యాం నుండి విడుదలవుతున్న జలాలు

పోలీసు అమరవీరులకు ఘననివాళి



అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి అంజలి ఘటిస్తున్న సీఎంస్టాలిన్

ప్యారీస్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో వీరమరణం పొందిన పోలీసు అమరవీరుల స్మారక దినోత్సవం సందర్భంగా సీఎం స్టాలిన్ సహా ఉన్నతాధికారులు మంగళవారం అంజలి ఘటించారు. మైలాపూర్‌లోని డీజీపీ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న పోలీసు అమరుల స్థూపం వద్ద పోలీసులు గాల్లోకి పేల్చి నివాళులర్పించారు. కశ్మీర్ లడాక్ ప్రాంతంలోని హాట్‌స్ప్రింగ్స్ అనే స్థలంలో చైనా సైనికులు 1959 అక్టోబరు 21న జరిపిన దాడుల్లో భారత కేంద్ర రిజర్వ్ భద్రతా విభాగానికి చెందిన 10 మంది పోలీసులు మరణించారు. అప్పటి నుంచి వీరితో పాటు దేశ వ్యాప్తంగా విధి నిర్వహణలో మృతిచెందిన పోలీసులకు ప్రతి ఏడాది అక్టోబరు 21న పోలీసు అమరవీరుల దినోత్సవంగా జరుపుకుంటున్నారు. ఆ రీతిలో డీజీపీ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సహా సైనిక, నేవీ, పోలీస్ విభాగాల అధికారులు పోలీసు అమరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముందగా మొక్కలు నాటి, పోలీస్‌శాఖలో పని చేసి మరణించిన పోలీసు కుటుంబాలకు బీమాన గదును సీఎం అందజేశారు. పోలీస్ శాఖలో సమాచార, రికార్డు అసిస్టెంట్, సహాయకుడి పోస్టులకు కారుణ్య ప్రాతిపదికన అర్హులకు ఉద్యోగ నియామక పత్రాలను సీఎం పంపిణీ చేశారు. ఇన్‌ఛార్జి డీజీపీ వెంకటరామన్, వెస్ట్ బెంగాళ్ మాజీ గవర్నర్ ఎంకే నారాయణన్ కూడా పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్చం ఉంచి అంజలి ఘటించారు.



ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్న చెన్నై జిల్లా ఖాజీగా నియమితులైన ఎన్పీ ఉస్మాన్ మొహిద్దీన్



ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్న దక్షిణ భారత సైన్యాధికారి లెఫ్టినెంట్ జనరల్ వి.శ్రీహరి తదితరులు

విమానాశ్రయ ప్రవేశద్వారంలో 3డీ స్క్రీన్‌లో ప్రకృతి దృశ్యాలు



స్క్రీన్ వద్ద ఫొటో తీసుకుంటున్న చిన్నారి

పెరంబూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా మీనంబాక్కం విమానాశ్రయంలో స్వదేశీ టెర్మినల్స్ 1,3, విదేశీ రాకపోకల టెర్మినల్ తదితర ప్రాంతాల్లో భారీ 3డీ స్క్రీన్లు ఏర్పాటుచేశారు. దేశ సహజ సౌందర్యం, పర్యాటక ప్రాంతాల్లోని ప్రత్యేక దృశ్యాలు, వన్యప్రాణులు, గ్రామీణ క్రీడలు, సంస్కృతికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రసారం చేశారు. 3డీ దృశ్యాలు ప్రయాణికులకు సరికొత్త అనుభవం, ఆనందం, ఉత్సాహం కలిగించాయి. పిల్లలు స్క్రీన్లలో దృశ్యాల వద్ద సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ స్క్రీన్లు శాశ్వతంగా కొనసాగించాలని ఆలోచిస్తున్నట్లు విమానాశ్రయ అధికారులు తెలిపారు.

కాల్వల విస్తరణ పనుల పరిశీలన

ప్యారీస్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దక్షిణ చెన్నై ప్రాంతంలో చేపట్టిన కాలువల విస్తరణ పనులను డిప్యూటీ సీఎం ఉదయనిధి మంగళవారం ఉదయం పరిశీలించారు. అతి భారీ వర్షాల కారణంగా వరదలు సంభవిస్తే నగరంలో వాననీరు నిల్వకుండా జలవనరుల శాఖ, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) సంయుక్తంగా కాలువల విస్తరణ, పూడికతీత పనులను చేపట్టాయి. మూడు నెలల నుండి ఇప్పటివరకు పూర్తిచేసిన పనులను పరిశీలించిన ఉదయనిధి మిగతా పనులను కూడా సకాలంలో పూర్తి చేయాల్సిందిగా సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఓపీఎం మడుగు కాలువలో రూ.27కోట్లతో చేపట్టిన పూడికతీత పనులను వేగవంతం చేయాలని, వరదనీరు ప్రవహించేలా గట్లను పటిష్ఠం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం షోళింగనల్లూరు ప్రాంతంలో రహదారులశాఖ ఆధ్వర్యంలో పిల్లర్లపై నిర్మిస్తున్న ఫ్లైఓవర్‌ను ఉదయనిధి పరిశీలించారు. ఆయన వెంట ఎమ్మెల్యే అరవింద్ రమేష్, ప్రభుత్వ అడిషనల్ చీఫ్ సెక్రటరీ ప్రదీప్‌యాదవ్, జీసీసీ కమిషనర్ కుమరగురుబరన్, జలవనరులశాఖ కార్యదర్శి జె.జయకాంతన్ తదితర అధికారులు ఈ పనులను పరిశీలించారు.

ఓఎమ్మార్‌లో ఓపీఎం కాలువ పనులు పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం ఉదయనిధి



మదురై సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు లీడ్ ప్లాటినం గుర్తింపు

టి.నగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మదురైలోని మీనాక్షి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ భారతదేశంలోనే అత్యంత పచ్చదనంతో కూడిన ఆస్పత్రిగా యూఎస్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (యూఎస్జీబీసీ) నుంచి ప్రతిష్ఠాత్మకమైన లీడ్ ప్లాటినమ్ సర్టిఫికేషన్ పొందింది. ఇంధన సామర్థ్యం, పర్యావరణపరిరక్షణలో అత్యుత్తమ ప్రమాణాలు పాటించినందుకుగాను ఈ అంతర్జాతీయ గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం పాల్గొని ఆస్పత్రి అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గురుశంకర్‌ను అభినందించారు. లీడ్ సంస్థ ప్రమాణాలను పాటించడం వల్లే ఇంధన, నీటివినియోగం బాగా తగ్గించగలిగామని, రోగుల సంరక్షణకు ఎంత ప్రాధాన్యత ఇస్తామో అంతే స్థాయిలో ఆస్పత్రి పరిసరాల్లో పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యతనిస్తామని ఆసుపత్రి నిర్వాహకులు పేర్కొన్నారు.



ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ ఎస్.గురుశంకర్‌ను అభినందిస్తున్న ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం

సమాచార దర్శిని

26న వేదవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో 'విశ్వనరుడు - జాషువా'పై ప్రసంగం

చెన్నై, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వేదవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 26న తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహిక 166వ ప్రసంగ కార్యక్రమం జరుగనుంది. ఇందులో భాగంగా 'విశ్వనరుడు - గుర్రం జాషువా' అనే అంశంపై నెల్లూరుకు చెందిన ఆధ్యాత్మిక సాహిత్య ఉపన్యాసకులు బొగ్గరపు రాధాకృష్ణమూర్తి ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమం టీ.నగర్ విజయ రాఘవరోడ్డులోని ఆంధ్రాక్లబ్ కృష్ణాహాలులో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు జరుగుతుందని సంస్థ అధ్యక్షులు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు ఓ ప్రకటనలో తెలిపారు.

విద్యా రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు వెనుకబడిన తరగతులు, అత్యంత వెనుకబడిన వర్గాల విద్యార్థులకు విద్యా రుణాలు అందించనున్నారు. ఈ మేరకు చెన్నై జిల్లా యంత్రాంగం విడుదల చేసిన ప్రకటనలో... బీసీ, ఎంబీసీలకు చెందిన వంద మంది విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించేందుకు విద్యా రుణాలు అందించనున్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు www.tabcedco.tn.gov.in అనే వెబ్ సైట్ నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకుని, పూర్తి చేసి, ఆయా జిల్లాల్లోని బీసీ సంక్షేమ శాఖ కార్యాలయాల్లో అందించాలని అధికారులు తెలిపారు.

సీఎం స్టాలిన్ తెన్‌కాశి పర్యటన వాయిదా

పెరంబూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ తెన్‌కాశి జిల్లా పర్యటన తాత్కాలికంగా వాయిదాపడింది. సీఎం స్టాలిన్ అన్ని జిల్లాల్లో పర్యటిస్తూ చేపట్టిన అభివృద్ధి పనులు, కొత్త పథకాలు, పనులకు శంకుస్థాపన తదితర కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ క్రమంలో, ఈనెల 24,25 తేదీల్లో తెన్‌కాశి జిల్లాలో సీఎం పర్యటించనున్నారని ప్రకటించారు. కాని రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాల కారణంగా కురుస్తున్న భారీవర్షాల కారణంగా సీఎం స్టాలిన్ తెన్‌కాశి జిల్లా పర్యటన తాత్కాలికంగా వాయిదాపడిందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సాతూర్ రామచంద్రన్ తెలిపారు.

కొత్తగా మరో 26 'తోళి' హాస్టళ్లు

పెరంబూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 26 ప్రాంతాల్లో మహిళల కోసం 'తోళి' వసతి గృహాల ఏర్పాటుపనులు జరుగుతున్నాయని మహిళల హక్కుల శాఖ మంత్రి పి.గీతాజీవన్ తెలిపారు. తూత్తుకుడిలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో తూత్తుకుడి, తిరునల్వేలి తదితర ప్రాంతాల్లో మహిళల కోసం 10 వసతి గృహాలను పునరుద్ధరించగా, ప్రస్తుతం అవి అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. అలాగే, ఆదిద్రావిడ సంక్షేమ శాఖ నుంచి తమ శాఖ పరిధిలోకి తీసుకున్న 3 వసతి గృహాలను పునరుద్ధంచామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం పద వసతి గృహాలు అందుబాటులో ఉండగా, కొత్తగా 26 'తోళి' వసతిగృహాల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. పోక్సో కేసుల్లో 6,999 మంది బాధితులకు రూ.103.63 కోట్లు పరిహారంగా అందించనట్లు మంత్రి తెలిపారు.

కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌కు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు

పెరంబూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలుకు జర్మన్ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఎల్‌హెచ్‌బీ బోగీలు అనుసంధానం చేయనున్నారు. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో... నాగర్‌కోయిల్ నుంచి తెలంగాణా రాష్ట్రం కాచిగూడకు వెళ్లే (నెం.16354) రైలుకు డిసెంబరు 13వ తేది నుంచి, కాచిగూడ నుంచి నాగర్‌కోయిల్ వెళ్లే (నెం.16353) రైలుకు ఈ డిసెంబరు 14వ తేది నుంచి 'లింక్ హాఫ్‌మాన్ బుచ్ (ఎల్‌హెచ్‌బీ) బోగీలు అనుసంధానం చేయనున్నారు. ఇవి సాధారణ బోగీల కన్నా ఎక్కువ మంది ప్రయాణికుల సామర్థ్యంలో పాటు ప్రమాదాల సమయంలో సురక్షితంగా ఉంటాయి.

నేటినుంచి కుండ్రత్తూర్ ఆలయంలో స్కందషష్ఠి వేడుకలు

పెరంబూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక కుండ్రత్తూర్ సుబ్రమణ్యస్వామి ఆలయంలో స్కందషష్ఠి వేడుకలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. తమిళనాడులో ఉత్తరం వైపు వెలసిన కుండ్రత్తూర్ సుబ్రమణ్యస్వామి ఆలయానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ ఆలయ కందషష్ఠి వేడుకలు బుధవారం ప్రారంభమై 27వ తేది వరకు జరుగనున్నాయి. వేడుకల్లో భాగంగా 26నకందలీశ్వర ఆలయంలో వేలాయుధం అందించే వేడుకలు, 27న శూరసంహారం, 28 తిరుకల్యాణం నిర్వహించనున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని వసతులు కల్పించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

మందకొడిగా రిజర్వేషన్లు

● ఆరు ప్రత్యేక రైళ్ల రద్దు

పెరంబూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ముందస్తు రిజర్వేషన్లు మందకొడిగా సాగటంతో బుధవారం నుంచి ఈ నెల 29వ తేది వరకు ప్రకటించిన ఆరు ప్రత్యేక రైళ్లు రద్దు చేశారు. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో వివరాలు ఇలా ఉన్నాయి..

● నెం.06122 చెన్నై సెంట్రల్-కొట్టాయం ప్రత్యేక రైలు బుధవారం రద్దు. మరుమార్గంలో గురువారం బయల్దేరాల్సి నెం.06153 కొట్టాయం- చెన్నై సెంట్రల్ రైలు రద్దు.

● - నెం.06153 చెంగల్పట్టు-తిరునల్వేలి మధ్య ఈ నెల 24,26 తేదీల్లో నడుపనున్న ప్రత్యేక రైళ్లు రద్దు. మరుమార్గంలో, నెం.06154 తిరునల్వేలి-చెంగల్పట్టు మధ్య ఈ నెల 24,26 తేదీల్లో నడుపనున్న ప్రత్యేక రైళ్లు రద్దు.

● నెం.06054 నాగర్‌కోయిల్- చెన్నై సెంట్రల్ మధ్య ఈ నెల 28వ తేది నడుపనున్న ప్రత్యేక రైలు రద్దు. మరుమార్గంలో, నెం.06033 చెన్నై సెంట్రల్-నాగర్‌కోయిల్ మధ్య ఈ నెల 29వ తేది నడుపనున్న ప్రత్యేక రైలు రద్దు.

ఫరూక్ అబ్దుల్లాకు సీఎం జన్మదిన శుభాకాంక్షలు

పెరంబూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జమ్ము కశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ నాయకుడు ఫరూక్ అబ్దుల్లాకు ముఖ్యమంత్రి స్టాలిన్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సీఎం స్టాలిన్ తన ఎక్స్ పేజీలో పోస్ట్ చేసిన వివరాలిలా ఉన్నాయి... 'జమ్ము కశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ నాయకుడు ఫరూక్ అబ్దుల్లాకు జన్మదిన శుభాకాంక్షలు. కశ్మీర్ హక్కులు స్వయంప్రతిపత్తికి భంగం కలుగుతున్న పరిస్థితుల్లో, కశ్మీర్ కోసం గళం విప్పుతూ ఫరూక్ అబ్దుల్లా పోరాడుతున్నారు. ఆయనకు ఆరోగ్యం, దీర్ఘాయుష్షు కలగాలని కోరుకుంటున్నానని' సీఎం స్టాలిన్ పోస్ట్ చేశారు.

నగరంలో పెరిగిన వాయుకాలుష్యం

● 60 మెట్రిక్ టన్నుల చెత్త తొలగింపు





నగరంలో అలుముకున్న వాయుకాలుష్యం - టపాకాయల చెత్తను తొలగిస్తున్న కార్మికులు

ప్యారీస్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగర వాసులు దీపావళి సందర్భంగా భారీ స్థాయిలో బాణసంచా కాల్చడంతో వాయుకాలుష్యం ఒక్కసారిగా పెరిగిపోయింది. రాష్ట్రంలో కూడా ఒకవైపు వర్షాలు కురుస్తున్నా, సంప్రదాయ పండుగను టపాసులు పేల్చి ఆనందోత్సాహాల మధ్య చిన్నా పెద్ద జరుపుకున్నారు. పోలీసులు అనుమతించిన సమయంలో పేల్చిన బాణసంచాతో నగరం దద్దరిల్లింది. 200 వార్డుల్లో ఎటుచూసినా టపాసుల శబ్దలే మారుమోగాయి. వాయుకాలుష్యం, క్రమక్రమంగా పెరిగింది. తిరువొత్తియూర్‌లో నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో వాయుకాలుష్యం చాలా తక్కువగా ఉందని వాతావరణ నిపుణులు తెలిపారు.

నగరంలో 60మెట్రిక్ టన్నుల చెత్త తొలగింపు....

బాణసంచా కాల్చడం వల్ల నగర వ్యాప్తంగా మూడు రోజుల్లో సుమారు 60 మెట్రిక్ టన్ను చెత్తను తొలగించినట్లు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ)తెలిపింది. జీసీసీ నిర్వహణలోని 15 జోన్ల పరిధిలో ఉన్న 200వార్డుల్లో పారిశుద్య కార్మికులు రేయింబవళ్ళు శ్రమించి మూడు రోజుల్లో మొత్తం 60మెట్రిక్ టన్నుల చెత్త తొలగించారు. ఆలందూరు జోన్ 6.89 మెట్రిక్ టన్నులు, పెరుంగుడిలో 6.8 మెట్రిక్ టన్నుల చెత్త తొలగించారు. అయితే, దీపావళి పండుగన రోజున బాణాసంచా కాల్చరడం ద్వారా వచ్చే చెత్త ప్రమాదకరంగా ఉండటంతో పారిశుధ్య కార్మికులు ఎంతో జాగ్రత్తతో తొలగించారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా 108 అంబులెన్స్‌కు సాధారణ రోజుల కంటే సోమవారం 61శాతం అదనంగా కాల్స్ వచ్చాయి. సాయంత్రం 6 నుంచి వచ్చిన 4,635 కాల్స్‌లో కాలిన గాయాలకు సంబంధించి 135 కాల్స్ వచ్చినట్లు ఆ విభాగం అధికారులు తెలిపారు.

గల్లంతైన మెడికో మృతదేహం లభ్యం



మృతదేహాన్ని ఒడ్డుకు చేరుస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పెరంబూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) కొడైకెనాల్ జలపాతం వద్ద ప్రవాహంలో గల్లంతైన వైద్య విద్యార్థి మృతదేహం లభ్యమైంది. దిండుగల్ జిల్లా కొడైకెనాల్‌కు కోయంబత్తూర్‌కు చెందిన 11 మంది వైద్య విద్యార్థులు గత ఆదివారం విహారయాత్రకు వెళ్లారు. పెత్తుప్పరై సమీపంలోని అంజు వీడు జలపాతం వద్దకు వెళ్లి స్నానాలు చేశారు. వారిలో పొల్లాచ్చికి చెందిన నందకుమార్ (21) నీటి ప్రవాహంలో కొట్టుకు పోయాడు. అతడి ఆచూకీ కోసం కొడైకెనాల్, దిండుగల్ ప్రాంతాలకు చెందిన 30 మంది అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు కలిపి 50 మంది గాలించారు. భారీవర్షాల కారణంగా నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో, గల్లంతైన విద్యార్థిని ఆచూకీ తెలుసుకోవడం జాప్యం జరిగింది. మంగళవారం ఉదయం మళ్లీ అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు గాలింపు చర్యలు చేపట్టారు. జలపాతానికి కొద్ది దూరంలో నందకుమార్ మృతదేహాన్ని కనుగొన్నారు. దీంతో, అతికష్టంతో మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చిన సిబ్బంది, పోస్టుమార్టం కు తరలించారు.

'బ్లాక్ దీపావళి శుభాకాంక్షలు' అంటూ పోస్టర్లు

పది మంది పారిశుధ్య కార్మికుల అరెస్ట్



నగరంలో ఏర్పాటు చేసిన పోస్టర్లు

పెరంబూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రేట ర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) కమిషనర్‌కు వ్యతిరేకంగా 'బ్లాక్ దీపావళి' శుభాకాంక్షలు అంటూ పోస్టర్లు అతికించిన పది మంది పారిశుధ్య కార్మికులను పోలీసులు అరెస్ట్ చేశారు. జీసీసీ పరిధిలో రాయపురం, తిరువిక నగర్ మండలాల్లో చెత్త సేకరణ పనులు ప్రైవేటు సంస్థకు అప్పగించారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గత నెల 1వ తేది నుంచి పారిశుధ్య కార్మికులు ఆందోళనలు చేపట్టారు. ఈ క్రమంలో, సోమవారం రాయపురం, తిరువిక నగర్ మండలాల్లోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికులు తమ వ్యతిరేకత తెలుపేలా పోస్టర్లు వెలిశాయి. పోస్టర్‌లో... 'చెన్నై కార్పొరేషన్ కమిషనర్ గారూ...చట్టవిరుద్ధంగా 2,000 మంది పారిశుధ్య కార్మికులను 'రాంకీ' కాంట్రాక్టర్ వైపు విసిరేసి, మా జీవితాలను అంధకారంలోకి నెట్టిన మీకు మా బ్లాక్ దీపావళి శుభాకాంక్షలు' అని పోస్టరులో ముద్రించారు. ఈ వ్యవహారంపై పెరియమేడు పోలీసులు కేసు నమోదుచేసి, పోస్టర్లు వేశారంటూ పది మంది పారిశుధ్య కార్మికులను అరెస్ట్ చేశారు.

● వీసీ సస్పెన్షన్ రద్దు వ్యవహారం..

గవర్నర్ ఉత్తర్వు చెల్లదంటూ వర్సిటీ సిండికేట్ తీర్మానం



మాజీ వీసీ వేల్‌రాజ్

చెన్నై, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అన్నా యూనివర్సిటీ మాజీ వైస్‌ఛాన్సలర్ వేల్‌రాజ్ సస్పెన్షన్‌ను రద్దు చేస్తూ ఛాన్సలర్, గవర్నర్ ఆర్ ఎన్ రవి ఇచ్చిన ఉత్తర్వు చెల్లదంటూ ఆ విశ్వవిద్యాలయం సిండికేట్ తీర్మానం చేసి ఆమోదించింది. వేల్‌రాజ్ 2021లో అన్నా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా నియమితులయ్యారు. మూడేళ్లపాటు ఆ పదవిలో కొనసాగిన తర్వాత రిటైర్మెంట్ వయస్సు రాకపోవడంతో విశ్వవిద్యాలయంలోనే ప్రొఫెసర్‌గా కొనసాగారు. అయితే వీసీగా ఉన్నప్పుడు ప్రైవేటు కళాశాలలకు గుర్తింపు ఇవ్వడంలో భారీ యెత్తున వేల్‌రాజ్ అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆ నేపథ్యంలోనే ఆయన పదవీ విరమణ చేయాల్సిన రోజున సస్పెండ్ అయ్యారు. పదవీ విరమణ రోజున తనను సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ వేల్‌రాజ్ ఛాన్సలర్, గవర్నర్ ఆర్‌ఎన్ రవికు అప్పీలు చేసుకున్నారు. ఆ అప్పీలును పరిశీలించిన మీదట వేల్‌రాజ్ సస్పెన్షన్‌ను రద్దు చేస్తూ గవర్నర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయాన్ని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి కూడా తెలిపారు. ఆ నేపథ్యంలో అన్నా విశ్వవిద్యాలయం సిండికేట్ సమావేశం శనివారం జరిగింది. ఆ సమావేశంలో మాజీ వీసీ సస్పెన్షన్ రద్దు చేస్తూ గవర్నర్ ఇచ్చిన ఉత్తర్వు చెల్లదంటూ తీర్మానం చేసి, ఆ మేరకు ప్రతిపాదనను సిండికేట్ సభ్యులు ప్రభుత్వ పరిశీలనకు పంపారు.

నేటినుంచి తిరుత్తణిలో స్కందషష్ఠి వేడుకలు



శ్రీవల్లీ,దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి

తిరుత్తణి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లాలో సుప్రసిద్ధ శైవక్షేత్రం తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో బుధవారం నుంచి స్కంద షష్ఠి ఉత్సవాలు జరుగనున్నాయి. బుధవారం నుండి మంగళవారం (28వ తేదీ)వరకు జరగనున్న ఈ వేడుకల్లో స్వామివారికి ప్రతిరోజూ ఉదయం లక్షార్చన, సాయంత్రం 5 గంటలకు పుష్పాంజలి, దీపారాధన నిర్వహిస్తారు. 23వ తేదీ (గురువారం) స్వామివారికి ప్రత్యేక అభిషేకం, 24న శుక్రవారం బంగారు కవచం అలంకారం, 25వ తేదీ శనివారం తిరుమంజన సేవ, 26న వెండి కవచధారణ, 27న స్వామివారి మూలమూర్తులకు చందనాలంకరణ అనంతరం ఉత్సవమూర్తులను తిరువీధుల్లో ఊరేగించనున్నారు. చివరిరోజైన 28వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు ఆలయ ప్రధానమండపంలో శ్రీవల్లీ, దేవసేన సమేత మురుగన్ తిరుకల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఉత్సవాల సమయంలో కొండపై వెలసిన షణ్ముగపెరుమాళ్ దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు ఆలయ జాయింట్ కమిషనర్ కె.రమణి, ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీధరన్ తెలిపారు.

వీఐపీల దర్శనం కోసం భక్తులు వేచి ఉండాలా...?

● హైకోర్టు ప్రశ్న

పెరంబూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి ఆలయంలో వీఐపీలకు తక్షణ దర్శనం కల్పించే సమయంలో భక్తులను ఎక్కువ సేపు క్యూలైన్లలో నిలబెట్టడం గర్హనీయమని హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ ఆలయ నిర్వాహకులను మందలించింది. వీఐపీల దర్శన సమయంలో గంటల తరబడి సామాన్య భక్తులను క్యూలైన్లలో అనవసరంగా నిలిపి ఉంచడం తగదని, సామాన్యభక్తులకు త్వరితగతిన దర్శనం కల్పించేలా ఉత్తర్వు జారీ చేయాలని కోరుతూ దాఖలైన ప్రజాహితవాజ్యంపై ఈ మేరకు హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ పిటిషన్ మంగళవారం విచారణకు రాగా న్యాయమూర్తి స్పందిస్తూ... తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి ఆలయంలో భక్తులు దర్శనం కోసం ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన అవసరం లేకుండా ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారని ప్రశ్నించారు. వీఐపీ, వీవీఐపీల దర్శనం కోసం ప్రత్యేక సమయం కేటాయించాలని ఆలయ అధికారులు, నిర్వాహకులు భావిస్తున్నారా? వీఐపీ దర్శన సమయంలో భక్తులు వేచి ఉండాల్సిన అవసరం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడానికి గల అవకాశాలపై సమగ్రమైన వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలుచేయాలని ఆలయ జాయింట్ కమిషనర్‌కు నోటీసులు జారీచేశారు.

విలువ ఆధారిత పరిశ్రమలు ప్రారంభించండి

● రైతులకు వ్యవసాయ శాఖ పిలుపు

పెరంబూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విలువ ఆధారిత పరిశ్రమలు ప్రారంభించాలని రైతులకు వ్యవసాయ శాఖ పిలుపునిచ్చింది. వ్యవసాయ శాఖ ద్వారా జాతీయ వంట నూనె మిషన్ అమలుచేస్తోంది. ఈ పథకం కింద రైతులకు కొత్తరకం విత్తనాలు, నూతన సాంకేతికత అందిస్తున్నారు. ఈ పథకంలో రైతులు విలువ ఆధారిత పరిశ్రమలు ప్రారంభించవచ్చు. ఆయిల్ ప్రెస్సింగ్ యంత్రాలు, కొబ్బరి క్రషింగ్ యంత్రాలు, నూనె శుద్ధి యంత్రాలు తదితరాల ఏర్పాటుకు గరిష్ఠంగా 33 శాతం సబ్సిడీ, రూ.9..9 లక్షల వరకు అందించనున్నారు. ఈ పథకంలో చేరేందుకు రైతులు, సంబంధిత జిల్లా వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా కలుసుకుని తగిన సూచనలు, సలహాలు పొందవచ్చని అధికారులు తెలిపారు.

వర్షాలపై నేడు డీఎంకే సమావేశం

పెరంబూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వర్షాకాలంలో పార్టీ సభ్యులు చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, సహాయక చర్యలపై నిర్ణయించేందుకు బుధవారం డీఎంకే ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యాలయం మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో... పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ ఉత్తర్వులు ప్రకారం, వర్షాకాలంలో పార్టీ సభ్యులు చేపట్టాల్సిన సహాయక చర్యలపై సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. తేనాంపేటలోని అన్నా అరివాలయంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమానికి పార్టీ ప్రధాన కార్యదర్శి, మంత్రి కేఎన్ నెహ్రూ అధ్యక్షతన వహిస్తుండగా, యువజన విభాగం కార్యదర్శి, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి మార్గదర్శకం చేయనున్నారని తెలిపింది. సమావేశంలో చెన్నై, తాంబరం, ఆవడి కార్పొరేషన్లు, పూందమల్లి మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా కార్యదర్శులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మేయర్లు, డిప్యూటీ మేయర్లు, కౌన్సిలర్లు, జిల్లా, నగర, శాఖ కార్యదర్శులు హాజరుకావాలని ప్రకటనలో తెలిపారు.

వాననీటిలో మునిగిన ఆలయం



వరదనీటిలో మునిగిన అమరలింగేశ్వరాలయం

చెన్నై, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు జిల్లా ఉడుమలై సమీపం తిరుమూర్తిమలై పరిసర ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు సోమవారం రాత్రి తిరుమూర్తి పంచలింగ జలపాతం వరదనీటిలో అమరలింగేశ్వరాలయం మునిగింది. ఆ ఆలయం వద్ద చిరు వ్యాపారులు ఏర్పాటు చేసిన తాత్కాలిక దుకాణాలు వరదనీటిలో కొట్టుకుపోయాయి. సుమారు 20 అడుగుల ఎత్తు కలిగిన ఆ ఆలయాన్ని 90 శాతం దాకా వరదనీరు ముంచెత్తింది.

తాగునీటి కోసం ధర్నా



వినాదాలు చేస్తున్న గ్రామస్తులు

తిరుత్తణి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపంలోని మేల్‌మురుగన్‌పట్టు పంచాయతీలో గత పది రోజులుగా తాగునీటి సమస్యపై అక్కడి గ్రామస్తులు అధికారులకు విజ్ఞప్తులు చేస్తున్నా, పట్టించుకోలేదని సమాచారం. దీంతో గ్రామస్తులు మంగళవారం ఉదయం చెన్నై-తిరుపతి రహదారిపై నిరసన చేపట్టారు. అదే గ్రామంలోవున్న న్యాయవాది అయ్యప్పన్ కూడా వీరికి మద్దతు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళకారులతో మాట్లాడారు. ఎంత చెప్పినా వినకపోయే సరికి నిరసనలో పాల్గొన్న కారణంగా న్యాయవాది అయ్యప్పన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆగ్రహించిన గ్రామస్తులు అయ్యప్పన్‌ను విడుదల చేయాలని పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసులు న్యాయవాది అయ్యప్పన్ సహా గ్రామస్తులందరిపై కేసు నమోదు చేశారు.

ఒకేసారి లక్ష టపాసులు పేల్చి దీపావళి జరుపుకున్న పది కుటుంబాలు



కోదండరామాపురంలో లక్ష టపాసుల సరానికి నిప్పంటించిన పది కుటుంబాల సభ్యులు

టి.నగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా కురింజిపాడి తాలూకా కోదండరామాపురానికి చెందిన పది కుటుంబాలు దీపావళిని వైవిధ్యంగా జరుపుకున్నారు. కోదండరామాపురంలో పక్కపక్కనే ఇళ్లల్లో నివసిస్తున్న పది కుటుంబాలకు చెందిన సభ్యులు దీపావళిని పురస్కరించుకుని తలా 10 వేల టపాకాయలున్న సరాలను కొనుగోలు చేశారు. సోమవారం సాయంత్రం తమ వీధిలో తాము తెచ్చిన 10 వేల టపాకాసుల సరాలను ఒక్కటిగా చేర్చారు. ఆ పొడవైన టపాకాయల సరాన్ని పది కుటుంబాల సభ్యులు వీధి పొడవునా నేలపై పరిచి పరస్పరం దీపావళి శుభకాంక్షలు తెలుపుకుంటూ ఆ సరానికి నిప్పంటించడంతో వరుసగా పేలాయి. ఆ పది కుటుంబాల సభ్యులు టపాకాయల సరానికి ఇరువైపులా నడచుకుంటూ వెళ్ళారు.

నిండిన వైగై డ్యాం: 5 జిల్లాలకు వరద హెచ్చరిక



వైగై డ్యామ్ నుండి ఉధృతంగా వెలువడుతున్న జలాలు

చెన్నై, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తేని పరిసర ప్రాంతాల్లో గత నాలుగు రోజులపాటు కురిసిన భారీ వర్షాల కారణంగా వైగై డ్యామ్ నీటిమట్టం పూర్తిస్థాయికి పెరిగింది. వైగై డ్యామ్ సామర్థ్యం 71 అడుగులు కాగా, డ్యామ్‌లో నీటిమట్టం 69 అడుగులకు చేరింది. దీంతో ఆ డ్యామ్ పరివాహక ప్రాంతాల్లో ఉన్న ఐదు జిల్లాల ప్రజలకు వరద హెచ్చరిక జారీ చేశారు. మంగళవారం ఉదయం 6.30 గంటల నుండి ఆ డ్యామ్‌లోకి 4875 ఘనపుటడుగుల చొప్పున జలాలు ప్రవేశిస్తున్నాయి. మధ్యాహ్నం నుండి వైగై డ్యామ్ పరీవాహక ప్రాంతాల్లో చెదురుమదురుగా వర్షాలు కురుస్తుండటంతో అదనపు జలాలను మరింత విడుదల చేసే అవకాశం ఉందంటూ జలవనరుల శాఖ అధికారులు తేని, దిండుగల్, మదురై, శివగంగ, రామనాథపురం జిల్లాలకు వరద హెచ్చరికలు జారీ చేశారు.

అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధంకండి

● కార్యకర్తలకు టీఎంసీ విజ్ఞప్తి



జీకే వాసన్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

ప్యారీస్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు ఎదుర్కొనేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని తమిళమానిల కాంగ్రెస్ (టీఎంసీ) అధ్యక్షుడు, మాజీ కేంద్రమంత్రి జీకే వాసన్ పిలుపునిచ్చారు. ఆళ్వార్‌పేటలోని టీఎంసీ ప్రధాన కార్యాలయంలో అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని ఆ పార్టీ తరుపున 234 నియోజకవర్గాల ఎన్నికల నిర్వాహకుల ఏర్పాటుపై చర్చించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి జీఆర్ వెంకటేష్, ఉపాధ్యక్షుడు శక్తివడివేల్, చంద్రన్, జిల్లా అధ్యక్షుడు ఈకే అరుణ్‌కుమార్, కళ్యాణి, రాణి తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పార్టీ నిర్వాహకులు, కార్యకర్తలకు ఎన్నికలకు సంబంధించి చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రచార వ్యూహం, బూత్ కమిటీల పనితీరు, ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక ఓటర్ జాబితాల పరిశీలన తదితరాలపై వాసన్ సూచనలిచ్చారు.

టపాసులు పేలి నలుగురి దుర్మరణం

● పట్టాభిరామ్‌లో మరో నలుగురి అరెస్ట్

ప్యారీస్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన పట్టాభిరామ్‌లో నాటు టపాసులు పేలిన ప్రమాదంలో నలుగురు మృతిచెందిన కేసులో పోలీసులు నలుగురిని అరెస్ట్ చేశారు. ఆవడి సమీపంలోని పట్టాభిరామ్ తండురై ప్రాంతానికి చెందిన ఆర్ముగం (50), కుమారుడు విజయ్(25)తో ఒకే ఇంట్లో నివసిస్తున్నారు. విజయ్ శ్రీపెరుంబదూరులో కొనుగోలు చేసిన నాటు టపాసులను ఇంట్లో నిల్వ వుంచి ఆలయ ఉత్సవాలు, జాతర, వివాహం తదితర శుభకార్యక్రమాలకు విక్రయిస్తుంటాడు. ఈ నేపథ్యంలో, ఆదివారం సాయంత్రం నాటు టపాసులు కొనుగోలు చేసేందుకు కొంతమంది విజయ్ ఇంటికి చేరుకున్న సమయంలో ఊహించని విధంగా ఆ టపాసులు పేలడంతో ఇంటి భవనం కూలింది. వెంటనే చుట్టుపక్కల వారు అందించిన సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని సహాయ కార్యక్రమాలు చేపట్టారు. కూలిన భవన శిథిలాల మధ్య నలుగురు మృతిచెంది ఉండడం గుర్తించి మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు. ఈ దుర్ఘటనలో మృతిచెందినవారు తిరునింద్రవూరుకు చెందిన సునీల్ (22), యాసిన్ (25), పొన్నేరికి చెందిన సుమన్ (22), సంజయ్ (22)లుగా పోలీసులు గుర్తించారు. ఈ ప్రమాదానికి కారణమైన ఆర్ముగం, అతని కుమారుడు విజయ్‌లతో పాటు మరో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

అనుమానం పెనుభూతమై...

● భార్యను హత్యచేసి డ్రమ్ములో పెట్టి ఖననం చేసిన భర్త



ప్రియ (ఫైల్‌ఫొటో) - భర్త సిలంబరసన్

పెరంబూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానంతో ఓ ప్రబుద్ధుడు ఆమెను హతమార్చి, శవాన్ని ప్లాస్టిక్ డ్రమ్ములో ఉంచి శ్మశానంలో ఖననం చేసిన ఘటన తిరువళ్లూర్ జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గుమ్మిడిపూండి ఎలావూరు సమీపం తురపాలెం గ్రామానికి చెందిన సిలంబరసన్-ప్రియ (26) దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. భార్యపై అనుమానంతో సిలంబరసన్ తరచూ గొడవపడేవాడని సమాచారం. అతడి వేధింపులు తట్టుకోలేని ప్రియ, పుదుపాళయంలో ఉన్న కన్నవారింటికి వెళ్లేది. అక్కడ వారు సర్దిచెప్పడంతో తురపాలెం తిరిగొచ్చేది. ఈ క్రమంలో, రెండు నెలలుగా కుమార్తె నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతో, రెండు రోజుల క్రితం ప్రియ తండ్రి శ్రీనివాసన్ తురపాలెంలోని కుమార్తె ఇంటికి వచ్చాడు. ఆయన ప్రియ గురించి అల్లుడిని ప్రశ్నించగా ఆమె పక్క గ్రామానికి వెళ్లిందంటూ సర్దిచెప్పాడు. అదే సమయంలో శీనివాసన్ ఇంటిలోని తన ఇద్దరు మనవళ్లతో మాట్లాడుతున్నప్పుడు ప్రియ ఇంటి నుండి మాయమై రెండు నెలలైందని తెలిపారు. దీంతో శీనివాసన్ తన కుమార్తె కనిపించడం లేదని ఆరంబాక్కం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని శీనివాసన్‌ను అదుపులోకి తీసుకుని విచారణ జరిపినప్పుడు అసలు గుట్టు రట్టయ్యింది. ఆగస్టు 14న ఇంటిలో ఎవరూ లేని సమయంలో ప్రియాతో గొడవపడి ఆమెను కత్తితో నరికి ప్లాస్టిక్ డ్రమ్ములో శవాన్ని దాచి, శ్మశానంలో ఖననం చేసి వచ్చానని తెలిపారు. శీనివాసన్ భార్య శవాన్ని ఒక్కడే ఎలా శ్మశానానికి తరలించాడనే విషయమై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గుమ్మిడిపూండి తహసీల్దార్ నేతృత్వంలో మంగళవారం ప్రియ మృతదేహాన్ని వెలికితీసి, పోస్టుమార్టంకు తరలించారు.

బాణసంచా ప్రమాదాల్లో 200 మందికి గాయాలు

● 319 మందిపై కేసు నమోదు

ప్యారీస్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ రోజు కాల్చిన టపాసుల వల్ల రాష్ట్రవ్యాప్తంగా 43ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు సభవించగా, టపాసులు కాలుస్తూ 200 మందికి పైగా గాయపడినట్లు రాష్ట్ర అగ్నిమాపక శాఖ తెలిపింది. చెన్నైలో 15 ప్రాంతాల్లో స్వల్పంగా అగ్నిప్రమాదాలు జరిగాయని, ఇందులో గాయపడిన 11 మంది కీల్పాక్ ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగంలో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఓ చిన్నారికి 7శాతం గాయాలయ్యాయి. రాయపేట ప్రభుత్వాస్పత్రిలో కాలిన గాయాలతో చేరిన 24 మంది ప్రథమ చికిత్స అనంతరం ఇంటికి తిరిగెళ్లారు. కాగా, నగరంలో 65 మంది చికిత్స పొందుతున్నారని, ఈ సారి ప్రాణనష్టం జరగలేదని అగ్నిమాపకశాఖ అధికారులు తెలిపారు.

319 మందిపై కేసు నమోదు...

నగరంలో పోలీస్‌శాఖ నిబంధనలను అతిక్రమించి టపాసులుకాల్చిన 319 మందిపై కేసు నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 6 నుంచి 7 గంటల వరకు, రాత్రి 7 నుంచి 8గంటలవరకు మాత్రమే బాణసంచా కాల్చేందుకు పోలీసులు అనుమతిచ్చారు. ఈ సమయ పాలన పాటించని 319 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. చెన్నై నగరంలో బాణసంచా కాల్చే సమయంపై నిఘా వేసేందుకు 102 పోలీస్ స్టేషన్లలో ఒక ఎస్సై నేతృత్వంలో ఇద్దరు పోలీసులతో ఒక కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీలు నగర వ్యాప్తంగా పెట్రోలింగ్‌లో నిమగ్నమై చెన్నై నగరంలో 19 కేసులు నమోదు చేశారు. అలాగే, ఆవడి, పూందమల్లి, పోరూర్, తిరువేర్కాడు, రెడ్‌హిల్స్ ప్రాంతాల్లో 111 కేసులతో పాటు మొత్తం 319 మందిపై కేసు నమోదు చేశారు. ఇదిలా వుండగా, అంచనాలకు మించి ఈ దీపావళికి రూ.7కోట్లకు పైగా టపాసులు దేశంలో అమ్ముడుపోగా, ఇందులో తమిళనాడు ప్రథమస్థానంలో నిలిచింది.